ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 59 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి సోమవారం 30 మార్చి 2026 పేజీలు : 04 వెల : 02









# పనిచేసే వాళ్లకే పదవులు

- సమర్థంగా పనిచేస్తే.. ప్రజాప్రతినిధులు మీరే
- పునర్విభజనతో 50% సీట్లు పెరుగుతున్నాయి.. మహిళలకు 33% రిజర్వేషన్
- కార్యకర్తలను పట్టించుకోని నాయకులు మాకు అవసరం లేదు
- తెదేపా 44వ ఆవిర్భావ దినోత్సవ సభలో పార్టీ అధినేత చంద్రబాబు
- అలాంటి వారికే ప్రజాప్రతినిధులుగా అవకాశం: చంద్రబాబు
- కార్యకర్తలను దూరం పెట్టే నేతలు మాకొద్దు
- కష్టపడేవారిని గుర్తించే బాధ్యత లోకేశ్‌దే
- అమరావతి దేవతల రాజధాని.. అది కొందరు రాక్షసులకు ఇష్టం లేదు
- ఇక మూడు ముక్కలాటకు తావులేదు
- ఆర్థికంగా ఇబ్బందులున్నా కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన అందిస్తున్నాం
- చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరికీ వివరించాలి
- ప్రతి ఎన్నికల్లో కూటమి గెలవాలి
- టీడీపీ ఆవిర్భావ సభలో సీఎం స్పష్టీకరణ

**ఈసారి 50 శాతం సీట్లు పెరగనున్నాయి. 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు అమలు కాబోతున్నాయి. పార్టీ కోసం ఎవరు బాగా పనిచేస్తే వారే ప్రజాప్రతినిధులవుతారు.**

**- టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు**

**వైసీపీ తప్పుడు ప్రచారాలను పార్టీ తిప్పికొట్టాలి. నిత్యం ప్రజల్లో ఉండాలి. చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరికీ వివరించాలి. వచ్చే అన్ని ఎన్నికల్లోనూ ఎన్డీయే గెలవాలి.**

**- టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు**

**ప్రస్తుత అధికారం కార్యకర్తల త్యాగాల ఫలితమే. కార్యకర్త లేకపోతే తెదేపా లేదు. అందుకే పార్టీలో కార్యకర్తే అధినేత. ఇది కొత్త సంప్రదాయం. దీన్ని ప్రవేశపెట్టిన లోకేశ్‌ని అభినందిస్తున్నా. పార్టీలో కష్టపడినవారికి ఉత్తమ కార్యకర్తగా సర్టిఫికెట్ ఇస్తే సరిపోదు, అన్ని రంగాలలో ఎక్కడికక్కడ అవకాశాలు కల్పించాలి. అదే మిగిలినవారికీ స్ఫూర్తినిస్తుంది.**

**- సీఎం చంద్రబాబు**

**కార్యకర్తలను పట్టించుకోని, ఇబ్బందులు పెట్టే నాయకులు అవసరం లేదు. కార్యకర్తల కష్టం వల్లే ఈ స్థాయిలో ఉన్నామని గుర్తుంచుకోవాలి. కార్యకర్తల్ని అణగదొక్కితే అది నాయకత్వం కాదు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉండే బాధ్యత నాది.. పార్టీ రక్షణగా నిలుస్తుంది. కూటమి మళ్లీ గెలవాలి. గెలిపించే బాధ్యత తెదేపా కార్యకర్తలదే. 2024 ఎన్నికల్లో 94% స్ట్రైక్‌రేటుతో విజయం సాధించాం. 2029 ఎన్నికల్లో 98-99% సాధించాలి.**

**-సీఎం చంద్రబాబు**

పార్టీ కోసం పని చేసే వాళ్లకే పదవులు ఇస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వాళ్లకే ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పిస్తామని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను దూరం పెట్టే నేతలను తానూ దూరం పెడతానన్నారు. కార్యకర్తలను పట్టించుకోని నేతలు తనకు అవసరం లేదని తేల్చిచెప్పారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు క్రమశిక్షణతో పని చేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు.

# ఇక భూతల దాడులు

- దళాలను మోహరిస్తున్న అమెరికా
- చర్చలంటూనే ఇదేం పని ? : నిలదీసిన టెహ్రాన్
- ఇరాన్ దాడిలో కీలక నిఘా విమానాన్ని కోల్పోయిన అగ్రరాజ్యం
- మధ్యప్రాచ్యానికి చేరుకున్న సైనిక పటాలం
- కొనసాగుతున్న దాడులు
- భారత్ వైపు కదులుతున్న రెండు ఎల్పీజీ నౌకలు
- ఇరాన్‌లో వైద్యసేవలు విస్తృతం
- పాకిస్తాన్ పతాక నౌకలకు ఇరాన్ అనుమతి
- మినాబ్‌పై దాడికి బాధ్యులు వీరే
- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై పాక్‌లో చర్చలు
- వర్సిటీలనూ వదలడం లేదు
- పరిశోధనా కేంద్రాలు, చారిత్రక కట్టడాలపై ఉద్దేశపూర్వకంగా దాడులు
- కొందరు ప్రముఖ శాస్త్రవేత్తలపై కూడా టార్గెట్
- కీలక నిఘా వ్యవస్థను కోల్పోయిన అమెరికా
- ఈ-3 సెంట్రీ ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (అవాక్స్)కు దెబ్బ
- మరమ్మతులకు పనికిరాని స్థావరం
- యుద్ధోన్మాదానికి చిన్నారులు బలి
- జనావాసాలపై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి.

# దళితులు పరిపాలన చేయొద్దా?

- వారి పట్ల ఇదేనా మీ వైఖరి
- అప్పుడు ఎస్సీని సీఎం చేస్తామన్నారు..మాట తప్పారు
- ఇప్పుడేమో దళితుడు స్పీకర్‌గా ఉన్నారు కాబట్టి సభకు రావటం లేదు : అసెంబ్లీలో బీఆర్‌ఎస్‌పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- గులాబీ పార్టీ మంత్రాలకు చింతకాయలు రాలవంటూ ఎద్దేవా
- పొంగులేటి రాజీనామా కుదరదంటూ వ్యాఖ్య
- ఇక్కడ ఉన్నది రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క అంటూ హెచ్చరిక



# లూటీదార్లు!

- ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములపై మోదీ ధ్వజం
- అధికారం దక్కితే జేబులు నింపుకోవడమే
- ఈసారి కేరళలో ఎన్డీఏ విజయం తథ్యం
- యువత, మహిళలు, రైతులు ఆదరిస్తున్నారు
- పాలక్కాడ్ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగం
- అన్ని కుంభకోణాలపై దర్యాప్తు
- ఆ సొమ్మంతా కక్కిస్తాం
- త్రిసూర్‌లో భారీ రోడ్ షో
- డోలు వాయించిన మోదీ
- కష్టకాలంలోనూ సత్తా చాటుతున్నాం



**: మన్ కీ బాత్‌లో మోదీ**

సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేరళను విచ్చలవిడిగా లూటీ చేశాయని ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. "రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అసలైన ఎ--టీమ్. అంతే తప్ప ఎవరికీ బి--టీమ్ కాదు" అని తేల్చిచెప్పారు. ఆదివారం కేరళలోని పాలక్కాడ్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని తేల్చిచెప్పారు. కేరళ ప్రజల మద్దతు, ఆశీస్సులతో ఎన్డీయే ప్రభుత్వం రాబోతోందని అన్నారు.

# అసోం ప్రజలకు కాంగ్రెస్ '5 హామీలు'

- ఆదివాసీలకు శాశ్వత భూమి పట్టా
- రూ.25లక్షల ఆరోగ్య బీమా!
- అసోం ఎన్నికలు 2026- ప్రజలకు 5 గ్యారెంటీలు ప్రకటించిన కాంగ్రెస్
- మహిళలకు నెలవారీ నగదు బదిలీ
- సీనియర్ సిటిజన్లకు నెలకు రూ.1250 చెల్లింపు
- బీజేపీ విచ్చలవిడి అవినీతి
- 100 రోజుల్లో న్యాయం!
- ఆదివాసీలకు పట్టా భూములు
- విజయం కోసం కాంగ్రెస్ తహతహ



అసోం ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆదివారం 5 హామీలు ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమం, అందరికీ ఆరోగ్య సంరక్షణ, భూ హక్కులు, జుబీన్ గార్గ్ మృతి కేసులో న్యాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అసోంలోని నౌబోయిచాలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ 5 హామీలను ప్రకటించారు. 'మా పార్టీ మహిళలకు భేషరతుగా నగదు బదిలీ, వ్యాపారానికి ఆర్థిక సాయం చేస్తుంది. బీజేపీ సర్కార్‌లాగా మహిళలు మా పార్టీలో సభ్యులుగా ఉండాలని మేము అడగము' అని ఖర్గే అన్నారు.

**బీజేపీ విచ్చలవిడి అవినీతి** అసోంలోని బీజేపీ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని ఖర్గే విమర్శించారు. ప్రజలను దోచుకొని, దిల్లీలోని తమ నాయకుల, వారి కుటుంబాల ఖజానాను నింపడానికి అసోం బీజేపీ తన డబుల్ ఇంజిన్?ను ఉపయోగిస్తోందని దుయ్యబట్టారు. 'అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ ఒక 'నకిలీ ముఖ్యమంత్రి'. ఎందుకంటే, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ,

# సౌదీలో ఇరాన్ విధ్వంసం

- రూ. 6000 కోట్ల విలువైన అమెరికా విమానం నాశనం
- అమెరికాను దెబ్బ కొట్టిన ఇరాన్..
- సౌదీ అరేబియా యూఎస్ బేస్‌పై అటాక్..

**❖ రూ. 6 వేల కోట్ల విలువైన అవాక్స్ విమానం ధ్వంసం..**

అమెరికాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై యూఎస్ వైమానిక దాడులకు అత్యంత కీలకమైన విమానాన్ని ఇరాన్ నాశనం చేసింది. శుక్రవారం సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై తాము జరిపిన క్షిపణి, డ్రోన్ దాడిలో అమెరికాకు చెందిన విమానం దెబ్బతిన్నట్లు ఇరాన్ ప్రకటించింది. అమెరికా సైనిక ఆస్తులతో పాటు ఈ-3 'సెంట్రీ'(ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్) కమాండ్ అండ్ కంట్రోల్ విమానం నాశనమైంది.



# పనిచేసే వాళ్లకే పదవులు

కష్టపడే కార్యకర్తలను, నేతలను గుర్తించే బాధ్యత లోకేశ్‌దేనని చెప్పారు. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. వ్యక్తిగత ప్రవర్తన మొదలుకొని ప్రతి అంశంలో టీడీపీ బ్రాండ్ నిలిపేలా వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో మమేకం కావాలని.. సమస్యలు పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు.

**కార్యకర్తే అధినేత**

కార్యకర్తల వల్లే మనం ఇక్కడ ఉన్నామని గుర్తుపెట్టుకోవాలి. పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేలు, మంత్రులైన వాళ్లు దీనిని బాగా అర్థం చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ పార్టీ సిద్ధాంతాలకు, విధానాలకు క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి. 2024 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్నాం. రికార్డులు బద్దలు కొట్టేలా విజయం సాధించాం. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన అందిస్తున్నాం. దేశంలో ఎవరూ ఇవ్వని స్థాయిలో సామాజిక పెన్షన్లు ఇస్తున్నాం. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం. డీఎస్సీ, పోలీసు రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు కల్పించాం. తాజాగా 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. ఇప్పటికే 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చాం. చెప్పినట్లుగా ఒక్క పైసా కూడా పెంచలేదు. పైగా ట్రూ అప్ నుంచి ట్రూ డౌన్ చేశాం. ఈ ఏడాది కూడా కరెంటు చార్జీలు పెంచం. అమరావతిలో మొదట ప్రారంభించిన పనులను 2028 ఆగస్టుకు పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం. అమరావతి దేవతల రాజధాని కాబట్టి కొందరు రాక్షసులకు ఇష్టం లేదు. ఇక మూడు ముక్కలాట లేదు. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అదే అమరావతి.

**టీడీపీ బలంగా ఉంటేనే..!**

అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదు. టీడీపీ బలంగా ఉంటేనే.. రాష్ట్రం బలంగా ఉంటుంది. పార్టీ గెలుపే రాష్ట్రం గెలుపు. పసుపు జెండా నిరంతరం ఎగరాలి. గతం.. వర్తమానం.. భవిష్యత్ టీడీపీవే. పార్టీ పుట్టుక నుంచి నేటి వరకు అన్నీ సంచలనమే తెలుగుదేశం పార్టీ అభివృద్ధి రాజకీయాలు చేస్తోంది. నాయకత్వం పెంపు కోసం నిరంతరం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఏకైక పార్టీ మనదే. కార్యకర్తలకు రాజకీయ సాధికారత కల్పిస్తాం. అన్ని పదవుల్లోనూ జనాభా దామాషా పద్ధతిలో అవకాశాలు కల్పిస్తాం. కార్యకర్తలకు ఆర్థిక సాధికారత కల్పిస్తాం. న్యాయబద్ధమైన సంపాదన వచ్చేలా సహకరిస్తాం.

**విజయాలు చూశాం.. సంక్షోభాలూ చూశాం**

తెలుగుదేశం పార్టీ విజయాలనే కాదు సంక్షోభాలను.. సవాళ్లనూ చూసింది. ఎంతోమంది కార్యకర్తలు త్యాగాలు చేశారు. ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆస్తులు కోల్పోయారు. నిద్రలేని రాత్రులు గడిపారు. టీడీపీని ఫినిష్ చేస్తామని ఆలోచన చేసిన వారే ఫినిష్ అయ్యారు. గత ప్రభుత్వ విధ్వంసంపై లోకేశ్ యువగళం పాదయాత్ర చేపడితే దాన్ని కూడా అడ్డుకున్నారు. కార్యకర్తల అండతో అడుగు ముందుకే వేశాడు. నన్ను కూడా జైల్లో పెట్టారు. ఇన్నేళ్ల ప్రస్థానం, నేటి ఈ అధికారం.. అంతా కార్యకర్తల త్యాగాలు, కష్టం వల్లే. వారి సంక్షేమం కోసం ట్రస్టు ద్వారా వేల మందికి ఉచిత విద్య అందిస్తున్నాం. పనిచేసిన వాళ్లకు గుర్తింపు ఉంటుంది. కష్టపడిన వాళ్లకు పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తాం. తోట చంద్రయ్య కొడుక్కి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చాం.

# లూటీదార్లు!

కేరళకు సేవ చేసే అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని వ్యాఖ్యానించారు. అధికారంలోకి రాగానే 'మోదీ గ్యారంటీ'ని అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఈసారి భిన్నమైన వాతావరణం కనిపిస్తోందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. సమాజంలో వేర్వేరు వర్గాల నుంచి ఎన్డీయేకు ఆదరణ పెరుగుతోందన్నారు. కేరళ యువత, మహిళలు, రైతన్నలు బీజేపీ కూటమిని ఎంతగానో అభిమానిస్తున్నారని వెల్లడించారు.

అన్ని కుంభకోణాలపై దర్యాప్తు

కేరళను ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ విపరీతంగా లూటీ చేశాయని మోదీ మండిపడ్డారు. "రాష్ట్రంలో ఆ రెండు కూటముల మధ్య అవగాహన ఉంది. ఒకరి తర్వాత ఒకరు అధికారంలోకి వచ్చి, జేబులు నింపుకొనేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీనివల్ల కేరళ ఆర్థికంగా నష్టపోయింది. బీజేపీ అధికారంలోకి వస్తే ఆ అక్రమాలు బయటకు వస్తాయని బెదిరిపోతున్నాయి. మేం గెలిచాక ఆ కుంభకోణాలపై దర్యాప్తు జరిపిస్తాం" అని ప్రకటించారు.

ఆ సొమ్మంతా కక్కిస్తాం

పదేళ్ల ఎల్‌డీఎఫ్ పాలనలో కేరళ రుణ భారం మూడు రెట్లు పెరిగి రూ.5 లక్షల కోట్లు దాటేసిందని మోదీ చెప్పారు. "ఈ సొమ్మంతా ఎక్కడికి వెళ్లిందో చెప్పాలంటూ ప్రజలు నిలదీస్తున్నారు. అది ఎల్‌డీఎఫ్ నేతల జేబుల్లోకే వెళ్లింది. మేం రాగానే ఆ సొమ్మంతా కక్కించి రాష్ట్ర అభివృద్ధికి వెచ్చిస్తాం. కేరళ ప్రగతి కోసం కేంద్రం భారీగా నిధులిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వాల కంటే రాష్ట్రానికి మేమే ఎక్కు నిధులు విడుదల చేశాం" అని చెప్పారు. "మహిళల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఆర్థిక సమగ్రత, ఆరోగ్య సంరక్షణ, గృహనిర్మాణంపై దృష్టి పెట్టాం. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి పార్లమెంట్‌లో 'నారీశక్తి వందన్ అధినియమ్ చట్టం' తెచ్చాం. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలేమో అత్యాచారం కేసుల్లో దోషులుగా తేలుతున్నారు" అని మండిపడ్డారు. పశ్చిమాసియా పరిణామాలపై కాంగ్రెస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం ప్రమాదకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని మోదీ దుయ్యబట్టారు. దానివల్ల గల్ఫ్ దేశాల్లోని భారతీయుల ప్రాణాలకు ముప్పుందన్నారు.

# ఇక భూతల దాడులు

డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం ఓ వైపు చర్చల మంత్రం పఠిస్తూనే మరోవైపు మధ్యప్రాచ్యానికి అదనపు దళాలను తరలిస్తోంది. తద్వారా భూతల దాడులు మొదలు పెడతామంటూ సంకేతాలు ఇస్తోంది. తాజాగా సుశిక్షితులైన మూడున్నర వేల మంది సైనికులు, నావికులను ఆ ప్రాంతంలో మోహరించింది. దీంతో ఇప్పుడు అక్కడ మకాం వేసిన అమెరికా సేనల సంఖ్య యాభై వేలకు చేరుకుంది. పశ్చిమాసియాలో అమెరికా సేనలు ఈ స్థాయిలో యుద్ధ సన్నాహాలు చేయడం గత ఇరవై సంవత్సరాల కాలంలో ఇదే మొదటిసారి. చర్చలు, దౌత్యం ద్వారా విభేదాలను పరిష్కరించుకుందామని చెబుతున్న అమెరికా తాజాగా భూతల దాడులకు కుట్ర పన్నుతోందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఘలీబాఫ్ ఆరోపించారు.

**మధ్యప్రాచ్యానికి చేరుకున్న సైనిక పటాలం:** అమెరికా సైనిక పటాలం యూఎస్ఎస్ ట్రిపోలీ నౌకలో మధ్యప్రాచ్యానికి చేరుకుంది. ఈ విషయాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ధృవీకరించింది. 'అమెరికా నావికులు, సుశిక్షితులైన సైనికులు ప్రత్యేక విధుల నిమిత్తం యూఎస్ఎస్ ట్రిపోలీ నౌకలో ఈ నెల 27వ తేదీన సెంట్రల్ కమాండ్ ప్రాంతానికి చేరుకున్నారు' అని శనివారం పొద్దుపోయిన తర్వాత సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలియజేసింది. దళాలు పూర్తి యుద్ధ సన్నాహాలతో ఉన్నాయంటూ కొన్ని చిత్రాలను కూడా విడుదల చేసింది. ఇదిలావుండగా యూఎస్ఎస్ బాక్సర్‌తో పాటు మరో రెండు నౌకలను, శాన్ డియాగో నుంచి అదనంగా ఓ మెరైన్ ఎక్స్‌పెడిషనరీ యూనిట్‌ను కూడా మధ్యప్రాచ్యానికి పంపాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ పరిణామాలను గమనిస్తే... ఇప్పటివరకూ వైమానిక, క్షిపణి దాడులకే పరిమితమైన అమెరికా ఇక దీర్ఘకాల పోరుకు భూతల దాడులకూ సిద్ధంగా ఉన్నదన్న సంకేతాలు కన్పిస్తున్నాయి. అయితే దీనిపై ట్రంప్ ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాగా ఇరన్ దక్షిణ తీరంలోని ఖర్గ్ దీవిని ఆక్రమించుకునేందుకు దానికి సమీపంలోనే అమెరికా సేనలు మోహరించి ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.

**కొనసాగుతున్న దాడులు:** బ బహ్రైన్, యూఏఈలలో అమెరికా సైన్యానికి చెందినవిగా భావిస్తున్న రెండు అల్యూమినియం కర్మాగారాలపై క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ దాడి చేసింది. మరోవైపు ఇజ్రాయిల్‌లోని వివిధ ప్రాంతాలపై కూడా ఇరాన్ క్షిపణి దాడులు జరిపింది. మరోవైపు ఇరాన్‌లో ప్రాధాన్యత కలిగిన లక్ష్యాలపై త్వరలోనే దాడులు చేస్తామని ఇజ్రాయిల్ తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల తయారీ కేంద్రాలు, అణు కేంద్రాలు, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలపై మరిన్ని దాడులు చేస్తానని చెప్పింది.

# దళితులు పరిపాలన చేయొద్దా?

'దళితులు పరిపాలనలో భాగస్వాములు కాకూడదా? వారు పెద్ద పదవులు చేపట్టొద్దా? ఇదేనా వారి పట్ల మీ పార్టీ వైఖరి...' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే దళితుడినే మొట్టమొదటి సీఎం చేస్తానని చెప్పిన ఆ పార్టీ అధినేత కేసీఆర్... ఇచ్చిన మాట తప్పారని ఎద్దేవా చేశారు. ఆనాడు అలా వ్యవహరించిన ఆయన... ఇప్పుడు శాసనసభ స్పీకర్‌గా దళితుడైన గడ్డం ప్రసాద్ కుమార్ ఉన్నారు కాబట్టే... అసెంబ్లీకి రావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆదివారం సభలో బిల్లులపై చర్చ సందర్భంగా... బీఆర్‌ఎస్ సభ్యులు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సంబంధించిన దానిగా చెబుతున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవహారంపై హౌస్ కమిటీకి పట్టుబట్టారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఆ సందర్భంగా సీనియర్ సభ్యుడు కడియం శ్రీహరి మాట్లాడేందుకు ప్రయత్నించగా... బీఆర్‌ఎస్ సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, ఆయన వైపు వేలు చూపుతూ.. రకరకాల సైగలు చేస్తూ బెదిరించినట్టుగా వ్యవహరించారు. ఆ సందర్భంగా సభలో పెద్ద దుమారం చెలరేగింది. ఈ దశలో జోక్యం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు. బీఆర్‌ఎస్‌ను, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌నుద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు, ఆ పార్టీ సభ్యుడు కేటీఆర్‌ను ఉద్దేశించి పలుమార్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్... వారికి పరిపాలన చేయరాదని, అందువల్ల తానే సమస్యలను పరిష్కరిస్తానని అవమానించి ముఖ్యమంత్రి పదవి చేపట్టారని విమర్శించారు. ఎస్సీని ఉప ముఖ్యమంత్రి చేసిన ఆయన.. ఆ తర్వాత అతడిని కూడా బర్తరఫ్ చేశారన్నారు. 2018లో ఎస్సీల నుంచి కొప్పుల ఈశ్వర్ ఒక్కరికే మంత్రివర్గంలో చోటు కల్పించారని గుర్తు చేశారు. అప్పట్లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దళితుడైన భట్టి విక్రమార్కను ఓర్వలేకపోయారని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందర్నీ లాక్కుని అపోజీషన్ లీడర్ పదవి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో ఆయన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా హరీష్‌రావు ఉండగా మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ఉన్నారని వివరించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో భట్టి విక్రమార్క... బడ్జెట్‌ను ప్రవేశపెడితే ఆయన్ను అవమానించేలా బీఆర్‌ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహా, సీతక్క వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, రామచంద్ర నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్... ఇలా చెప్పుకుంటే పోతే ఎంతోమంది దళితులకు, ఆదివాసీలకు తమ ప్రభుత్వంలో పదవులు కల్పించామని చెప్పారు. ఇదీ తమ టీమ్ అని పేర్కొన్నారు. కానీ గతంలో కేసీఆర్ టీమ్‌లో హరీష్ రావు, కేటీ రామారావు, దయాకర్ రావు, వినోద్ రావు, కవితారావు, సంజరురావు... ఇలా అందరూ రావులే ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. దళితులను చిన్నచూపు చూసే కేసీఆర్‌కు కనువిప్పు కలిగించేందుకే స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎన్నుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో దళితుడిని మైక్ అడగాల్సి వస్తుందనే కాఉరణంతోనే కేసీఆర్ సభకు రావటం లేదని దెప్పిపొడిచారు. ఈ రకంగా బీఆర్‌ఎస్ నేతలు దళితులపట్ల తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, ఇతర పార్టీల్లోంచి వచ్చిన వారికి మంత్రి పదవులిచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు అదే పార్టీ నేతలు ఫిరాయింపులపై మాట్లాడటం, సభలో గోల చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఆదాయాన్ని పెంచి పేదలకు పంచాలనే విధానంతో ముందుకు వెళుతున్నామని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సంస్కరణల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతున్నామని తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి 2025లో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని మైనింగ్ శాఖ నోటీసులు ఇచ్చి పన్నులు రాబట్టిందని చెప్పారు. ఏ విషయంలోనైనా ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇంత పారదర్శకంగా తాము తీసుకున్న చర్యలను అభినందిస్తే అధికారులు మరింత ఉత్సాహంగా పనిచేసేవారని అభిప్రాయపడ్డారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో మూడు హౌస్ కమిటీలు వేసి, బ్లాక్ మెయిల్ చేసి ఆస్తులు గుంజుకున్నారని వివరించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి రాజకీయ లబ్ధి పొందారని వ్యాఖ్యానించారు. వారిలా హౌస్ కమిటీ వేసి రాజకీయ లబ్ధి పొందాలని తాము భావించటం లేదన్నారు. అందుకే పదేండ్ల నుంచి ఇప్పటి వరకు జరిగిన ఖనిజ సంపద దోపిడీ, అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని తెలిపారు. ప్రతిపక్షాల దగ్గర ఎలాంటి ఆధారాలు ఉన్నా సీబీసీఐడీ అధికారులకు అందించాలని సూచించారు. వాటిపై సంపూర్ణంగా విచారించి, దోషులను శిక్షిస్తామని స్పష్టం చేశారు. హౌస్ కమిటీ వేసినా నివేదికను మళ్లీ ఏదో ఒక ప్రభుత్వ విచారణ సంస్థకు ఇవ్వాల్సిందేనని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే తాము నేరుగా సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని స్పష్టం చేశారు. ఆ సంస్థపై నమ్మకం లేకపోతే సీబీఐకి విచారణకు అప్పగించాలా? అని అడిగారు. బ్లాక్ మెయిల్ చేయడానికే బీఆర్‌ఎస్ నేతలు హౌస్ కమిటీ కోరుతున్నారని విమర్శించారు. 'ఇక్కడ ఉన్నది రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క... అందువల్ల మీ పప్పులుడకవు...' అని హెచ్చరించారు. అక్రమ మైనింగ్ విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అయినా, రేవంత్‌రెడ్డి కుటుంబమైనా... ఆ వ్యవహారంలో ఎవరున్నా ఆధారాలు బయటపెట్టాలని సీఎం సవాల్ విసిరారు. ఆధారాలుంటే ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 'మీరు చెప్పింది వినకపోతే పొంగులేటి రాజీనామా చేయాలా? ' అని ప్రశ్నించారు. మీ తాతలు దిగొచ్చినా అది జరగదు...' అని వ్యాఖ్యానించారు. సభా సంప్రదాయాలకు వ్యతిరేకంగా చైర్‌ను డిక్టేట్ చేసే సంస్కృతి ఎక్కడిదని ప్రశ్నించారు. ఎన్నో ఏండ్ల అనుభవమున్న సీనియర్ సభ్యులు వ్యవహరించేది ఇలాగేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి నిజాయితీ, నిబద్ధతను దేశంలో ఎవరూ శంకించలేరని సీఎం వ్యాఖ్యానించారు. 'మీ సభ్యుడు వ్యవహరించిన తీరును మీరు సమర్థిస్తున్నారా..? కడియంకు జరిగినట్టుగా కేసీఆర్‌కు జరిగితే మీరు సమర్థిస్తారా..?' అంటూ హరీశ్‌రావు, కేటీఆర్‌లను సీఎం ప్రశ్నించారు. సభలో కుస్తీలు పట్టడానికి రాలేదని, సీనియర్ సభ్యులను అవమానించే ఇలాంటి వ్యవహార శైలి మంచిది కాదని హితవు పలికారు. దీనికి ఇక్కడే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అవమానకరంగా, అసభ్యంగా వ్యవహరించిన పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. హరీష్‌రావు సూచన మేరకు ఎథిక్స్ కమిటీని ఏర్పాటు చేసి దానికి పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహారాన్ని సిఫారసు చేయాల్సిందిగా సీఎం కోరారు.

# మహిళలపై వరాల జల్లు

అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నాలుగు రాష్ట్రాల్లో మహిళా ఓటర్లను తమవైపునకు తిప్పుకొనేందుకు అధికార పార్టీలు పెద్ద ఎత్తున నగదు బదిలీ పథకాల్ని ఎంచుకున్నాయి. రాజకీయ పార్టీల విజయావకాశాలను మెరుగుపరిచే వ్యూహంగా నగదు బదిలీ పథకం మారిపోయింది. మొత్తం నాలుగు రాష్ట్రాల్లో మహిళల బ్యాంక్ ఖాతాల్లోకి నగదు బదిలీ ద్వారా ఇప్పటికే అందజేస్తున్న సొమ్ము రూ.24,500 కోట్లుగా ఉందని లెక్కలు చెబుతున్నాయి. తాము తిరిగి అధికారంలోకి వస్తే మరో ఐదేండ్లపాటు ఈ పథకాలు కొనసాగుతాయని ఆయా పార్టీలు హామీ ఇస్తున్నాయి. తమిళనాడులో అధికార డీఎంకే 'స్పెషల్ సమ్మర్ ప్యాకేజ్' కింద ప్రతి మహిళకు రూ.2,000 ఇప్పటికే అందజేసింది. అస్సాంలో బీజేపీ 'బిహు బోనస్' కింద 40 లక్షల మంది మహిళల ఖాతాలో రూ.4,000 జమచేసింది. వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళలో 10 లక్షల మంది మహిళలకు ప్రతినెలా రూ.1,000 అందించే పథకం మొదలైంది. ఇక పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ సర్కార్ ఫిబ్రవరిలో 'లక్ష్మీ భండార్'తో అందజేస్తున్న మొత్తాన్ని రూ.500 పెంచింది. మొత్తం ఈ నాలుగు రాష్ట్రాల్లోని 17.89 కోట్ల మంది మహిళల్లో 4.1 కోట్ల మంది మహిళలు నగదు బదిలీ పథకాల్లో లబ్ధిదారులుగా ఉన్నారు.

**నగదు బదిలీ సాయం 2,000కు పెంపు: డీఎంకే**

తమిళనాడులో అధికార డీఎంకే మహిళా ఓటర్ల కోసం భారీగా ఎన్నికల తాయిలాలు ప్రకటించింది. తమను గెలిపిస్తే.. ప్రతి మహిళకు రూ.8,000 కూపన్, ప్రతి నెలా నగదు బదిలీ ద్వారా అందిస్తున్న సాయం రూ.2,000కు పెంచుత్తామని, రూ.5 లక్షల వడ్డీ లేని రుణాలు అందిస్తామని సీఎం స్టాలిన్ ప్రకటించారు. రాష్ట్రంలో మహిళా ఓటర్లే లక్ష్యంగా ఆదివారం ఆయన పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేశారు. నగదు బదిలీ, ఆర్థిక మద్దతు, సామాజిక మౌలిక సదుపాయాల పేరుతో మహిళా ఓటర్లపై వరాల జల్లును కురిపించారు. మ్యానిఫెస్టోను విడుదల చేస్తూ 'ఇల్లతరుసు' పథకాన్ని స్టాలిన్ ప్రవేశపెట్టారు. గృహోపకరణాల కొనుగోలు కోసం రూ.8,000 కూపన్లు, స్వయం సహాయక బృందాల ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాన్ని మహిళలకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగం చేసే మహిళల కోసం, వారి పిల్లల సంరక్షణ బాధ్యతలు చూసే 1,000 శిశు సంరక్షణ కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేస్తామని డీఎంకే వెల్లడించింది.

**అస్సాంలో ప్రతి మహిళకూ రూ.50 వేలు సాయం: కాంగ్రెస్**

అస్సాంలో అధికారాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ మహిళలపై పెద్ద ఎత్తున హామీలు గుమ్మరించింది. ఎలాంటి షరతుల్లేని నగదు బదిలీ పథకాన్ని మహిళల కోసం తీసుకొస్తున్నట్టు కాంగెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు.

# ఘనంగా కావలిలో టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి**

**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్** తెలుగువారి ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం పుట్టింది తెలుగుదేశం పార్టీ. సమాజమే దేవాలయం- ప్రజలే దేవుళ్లు అని నినదించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ ఎన్టీఆర్ స్ఫూర్తితో పేద ప్రజలకు అండగా నిలిచింది. టీడీపీ ఆవిర్భావం తర్వాతే సమాజంలో అణగారిన, బడుగు,బలహీనవర్గాలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు వచ్చింది. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని. ప్రపంచంలో తెలుగువారిని నెం.1గా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవటం సంతోషకరమని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు..నెల్లూరు జిల్లా, కావలి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి జెండా ఎగరవేశారు,పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జెండా ఎగరవేసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.. అనంతరం బృందావనం కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు అన్న ఎన్టీఆర్ అభిమానులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులు అర్పించారు. పార్టీ ఆదేశాల మేరకు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పార్టీ కార్యకర్తల్లో శ్రమించి పనిచేసిన వారిని సన్మానించారు. శాలువా కప్పి ఆయా రంగంలో పనిచేసిన వారిని ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 44వ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, నీతి నిజాయితీకి, నిబద్ధతకు మారు పేరు అని, అన్న ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ లో



మనమందరం పనిచేయటం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. సిద్ధాంతం నిబద్ధతతో కూడిన పార్టీగా భావిస్తూ క్రమశిక్షణగా ఎదగాలన్నారు. ఎన్ని ఆటుపోట్లు వచ్చినప్పటికీ జాతీయ స్థాయిలో పార్టీ బలోపేతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్ ఎంతో ప్రతిష్టాత్మకంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. అత్యంత ఎక్కువ సభ్యత్వాలు కలిగిన, ఖ్యాతి కలిగిన, గొప్పగా చెప్పుకునే పార్టీగా టిడిపి ఎదిగిందని, రాష్ట్ర ప్రగతి కోసం పాటుపడే పార్టీగా నిలిచిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ ఆధ్వర్యంలో మనమంతా పనిచేయడం అదృష్టం అన్నారు. 74 సంవత్సరాల చంద్రబాబు నాయుడు విశ్రాంతి లేకుండా శ్రమిస్తూ ఉంటే, మనమందరం ఎంతగా కష్టపడాలో ఆలోచించాలన్నారు. గత ఐదు సంవత్సరాల్లో రాక్షస పాలనను ఎదుర్కొని రాబోయే తరాల వారికి యువ నాయకుడు లోకేష్ మాదిరిగా మారబోతున్నారన్నారు. రాష్ట్ర రాజధాని విషయంలో ఎంతగానో కృషి చేస్తున్నారని, అలాగే పార్టీ కార్యకర్తలు, నాయకులు వారి వారి గ్రామాల్లో శ్రమపడి నిబద్ధతతో పనిచేసి మన బిడ్డల భవిష్యత్ తరాల కోసం పాటుపడాలన్నారు. కార్యకర్తలు అందరూ చిన్నచిన్న పొరపాట్లకు అపార్థం చేసుకోవద్దు అన్నారు. రాజకీయాలలో హత్యలు ఉండవు అని, ఆత్మహత్యలే ఉంటాయన్నారు. స్వయంకృపరాధమే మన జీవితానికి ఓటమిపాలు చేస్తుందన్నారు. పెద్దల సూచనలు పాటిస్తూ అడుగులు వేయాలన్నారు. ఎప్పుడు కూడా పార్టీ శాశ్వతం అన్నారు. అంతేకానీ నాయకులు వస్తారు, పోతారు అన్నారు. అరచేతితో సూర్యబింబాన్ని ఆపలేము అని తెలిపారు. పార్టీ కేడర్ లో విభేదాలు లేకపోవు అని, ప్రతి కుటుంబంలో, గ్రామంలో, పట్టణంలో విభేదాలు అనేవి ఉంటాయని, సరిచేసుకుంటూ వెళ్లడమే నాయకత్వ లక్షణం అన్నారు. నన్ను ఇబ్బందులు పెట్టినా నేను తలవంచుకొని పోతున్నానే తప్ప, ఏ ఒక్కరిని ఇబ్బంది పెట్టలేదు అన్నారు. నాపై అనేక రాళ్లు వేసిన, ఆ రాళ్ళను ఆనకట్టగా వేస్తూ కావలి అభివృద్ధిని ఏమాత్రం ఆగనీయకుండా ముందుకు తీసుకుపోతున్నానన్నారు. కావలి నియోజకవర్గం తనను ప్రజలకు పెద్దన్నగా ఉంచారని, ఆ బాధ్యతను నెరవేరుస్తానన్నారు. ఎమ్మెల్యే ప్రజలందరికీ ఒకే విధంగా పని చేస్తారని, ప్రజల మనిషిని అన్నారు. రేపటి గెలుపు కోసం ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేసి నిలవాలన్నారు. రిజర్వేషన్ల ప్రకారం పార్టీ పదవులు వస్తాయి తప్ప మన సొంత నిర్ణయాలు పని చేయవు ఆ. అన్ని పదవులు ఒకరికే రావు అని, అలాగే పనులు అన్నీ కూడా ఒకరికే రావు అని, సంపద అంతా ఒకరికే రావాలనుకోవడం సరైన విధానం కాదన్నారు. నేను ప్రసాదం లాంటి వాడనని, వెంకటేశ్వర స్వామి ప్రసాదమును అన్నారు. ఆ ప్రసాదాన్ని ఒక్కడినే తింటే అది స్వార్థం అవుతుందని, అందరికీ పంచి పెడితే అది ప్రసాదమవుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటాను, కనుక సంయమనం పాటించి సహకరిస్తూ తన సమయాన్ని కూడా వృథా చేయకుండా తనకు సహకరించాలి అన్నారు. ఇతరులకు అవకాశం దొరికే విధంగా ఉండాలన్నారు. ప్రజా ధర్బార్ సమయంలో ప్రజలకు అవకాశం ఇద్దాం అన్నారు. కావలి నియోజకవర్గం టిడిపి పార్టీకి అడ్డాగా మారుస్తానని..కావలికి రేపు ఎలాంటి రిజర్వేషన్ వస్తుందో తెలియదు, కనుక కావలి మన సొత్తు కాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# గుండె చప్పుళ్ళు

గుండె మనిషి శరీరంలో
రక్తాన్ని నిరంతరం పంపిణీ చేసే
ఒక ముఖ్యమైన అవయవం
శరీరంలోని అన్ని కణజాలాలకు
ఆక్సిజన్ పోషకాలను అందిస్తుంది
ఒక ప్రత్యేమైన కండరాలు
నిరంతరంగా పని చేసి
మనిషిని బ్రతికిస్తున్నాయి
ఇప్పుడు గుండె శబ్దం మారింది
అది నిశ్శబ్దంగా ఉంటూనే
తన శబ్దాన్ని మార్చేసింది
మనిషి తన ధన దాహాన్ని
గుండెకు ఆపాదించడం వల్ల
గుండె తన ప్రకాంపనలు మార్చింది
కాలానికి అనుగుణంగా
మనిషి గుండెకు కూడా
బాగా అర్థమయ్యిందిలే
లబ్ డబ్ కి బదులుగా
డబ్బు డబ్బు అని గుండె
కొట్టుకోవడం అలవాటైపోయింది
ఇప్పుడు మనీ మనిషికే కాదు
గుండెకు కూడా మనీ కావాలి
డబ్బుంటేనే గుండె మోత
లేదంటే గుండె కోతగా మారింది.



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# ఆత్మకూరు మండలం కరటంపాడు గ్రామములో ఘనంగా టిడిపి పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఏసిపోగు బాబు విజ్ఞాన దిన పత్రిక విలేకరి... ఆత్మకూరు** ఆదివారం ఉదయం 9గంటలకు ఆత్మకూరు మండలం కరటంపాడు గ్రామములో ఘనంగా టిడిపి పారీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీడీపీ పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు గారి పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవధాయ మరియు ధర్మ ధాయ శాఖ మాత్యులు శ్రీ అనం రామనారాయణ రెడ్డి గారి సూచనతో,టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు సర్వేపల్లి నియేజకవర్గ టిడిపి పార్టీ పరిశీలకులు దావా పెంచలరావు గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో ముందుగా పార్టీ వ్యస్థాపకులు విశ్వ విఖ్యాత,నట సౌర్వభౌమ, స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి విగ్రహం నకు గజమాలతో నివాళులు అర్పించి, తదుపరి పార్టీ జెండాను ఆవిష్కరించి భారీ కేక్ ను కట్ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ముందుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు గారు మాట్లాడుతూ.... 1982 మార్చి 29 తేదీన దేశ రాజకీయాల చరిత్రలను మారుస్తూ.. తెలుగు ప్రజలు, తెలుగు బాష, తెలుగువారి ఆత్మగౌరవం కోసం స్థాపించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అపార్టీని స్థాపించిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారకరామారావు గారు అని సగర్వంగా చాటి చెప్పే రోజు ఈరోజు అని తెలియజేసారు. 44వ టిడిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో మా స్వంత గ్రామములో పాల్గొనడం సంతోషంగా ఉందని, తెలిపారు.దేశ చరిత్రలో పేద ప్రజలకు సంక్షేమ మరియు అభివృద్ధిని పరిచయం చేసిన ఘనత ఎన్టీఆర్ గారికి దక్కుతుందని తెలిపారు..ఈనాడు టిడిపి పార్టీని విజనరితో ముందు తీసుకొని వెళ్తున్న..మా నాయకుడు గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి.. పార్టీని సంక్షేమ అభివృద్ధి పదం లో నడుపుతున్న మా యువ నాయకుడు శ్రీ నారా లోకేష్ గారికి ఎల్లప్పుడు కార్యకర్తలు అండగా ఉంటారని తెలిపారు..అదేవిధంగా టిడిపి పార్టీ మండల సీనియర్ నాయుకులు గార్లపాటి ఫౌండేషన్ చైర్మన్



మాజీ సర్పంచ్ గార్లపాటి వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ... భారత దేశ రాజకీయ చరిత్రలో తొమ్మిది నెలలులో ఒక్కరోజు కూడా విరామం లేకుండా చైతన్య రధంలో ప్రజా క్షేత్రంలో తిరిగి పార్టీ ని అధికారంలోకి తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి గౌరవ శ్రీ నందమూరి తారకరామారావు అని ఆయనను కొనియాడారు..ఈ కార్యక్రమం లో టిడిపి పార్టీ మండల ట్రెజరర్ మహమ్మద్ హనీఫ్ గ్రామ సర్పంచ్ పూనుగుంట రేవతి గారు మరియు సోమశిల ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ పూనుగుంట ధనుంజయ,లు పాల్గొని ప్రసంగించడం జరిగింది.ఈ కార్యక్రమం లో గ్రామ టిడిపి నాయుకులు పఠాన్ జబ్బార్ షేక్ ఖాజామొహిద్దీన్ పూనుగుంట శ్రీరాములు పఠాన్ గౌస్ ఖాన్,పఠాన్ సుభహన్, కోసూరు చెన్నయ్య, షేక్ నజీరఖాన్ షేక్ గౌస్ ఖాన్,కొంగి పెంచలరావు, మన్నెపల్లి ప్రసాద్ ఏసిపోగు బాబు,బండారు మోహన్ కృష్ణ, లాయర్ రజని,వల్లభనేని రామయ్య, జడపల్లి మహేష్,సాతనుపల్లి యువ నాయకులు పూనుగుంట జగదీష్, మరియు యూత్, టిడిపి గ్రామ నాయుకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్** కావలి పట్టణంలో ఏ ఏం బేకరీ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్నవ రవి చంద్ర మలిశెట్టి వెంకటేశ్వర్లు . పొట్లూరు శ్రీనివాసులు నీ తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య. 31 వ వార్డ్ ఇంచార్జ్ మంచాల ప్రసాద్. 22వ వార్డు ఇన్చార్జ్ కుందుర్తి కిరణ్ కుమార్. పోతుగంటి శ్రీకాంత్. జనిగర్ల మనోహర్. తెలుగు యువత అధ్యక్షులు కావేరి శివకుమార్.మహేష్. శ్రీనివాసులు. కొమర ప్రసాద్. నల్లమోతు శీను మరియునాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ పార్టీ వీరాబిమాని.. కోసూరు చెన్నయ్య..



ఆత్మకూరు మండలం కరటం పాడు గ్రామములో టీడీపీ పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలులో చురుకుగా పాల్గొని భారీ కేక్ మరియు స్వీట్స్ పంచిన టీడీపీ పార్టీ అభిమాని మరియు కరటంపాడు గ్రామ కార్యదర్శి కోసూరు చెన్నయ్య తన అభిమానాని చాటుకున్నారు... ఆయనతో గ్రామ యువకులు ఈ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది.

# ఘనంగా కావలిలో టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**-44వ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ..**



**కావలి: విజ్ఞాన్ దినపత్రిక న్యూస్** నెల్లూరు జిల్లా,కావలి పట్టణంలోని బృందావనం కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు అన్న ఎన్టీఆర్ అభిమానులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులు అర్పించారు. పార్టీ ఆదేశాల మేరకు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# దగదర్తిలో ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

**దగదర్తి: విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దగదర్తి మండల టిడిపి ఇన్చార్జ్ మాలేపాటి రవీంద్ర నాయుడు ఆదేశానుసారం దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాలేపాటి లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దగదర్తి మండల సీనియర్ నాయకులు కంచర్ల సునీల్, మాలేపాటి సుధాకర్ సూచనలతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి దగదర్తి మసీదు సెంటర్లోని జండా స్తూపం వద్దకు చేరి జై తెలుగుదేశం.. జై జై తెలుగుదేశం.. అనే నినాదాలతో హోరెత్తించారు. భారీగా బాణాసంచా పేల్చిన అనంతరం మాలేపాటి లోకేష్ తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి వచ్చిన పార్టీ శ్రేణులు అందరికీ 44 వసంతాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాలేపాటి లోకేష్ మాట్లాడుతూ.. 1982 మార్చి 29వ తేదీన స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగుజాతికి ఒక గుర్తింపు తెచ్చారన్నారు. నాడు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు నేడు దేశానికి దిక్సూచిగా మారాయని, కొంతమందికే పరిమితమైన రాజకీయం, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో సామాన్యుని చేరి, బడుగు బలహీనవర్గాల ప్రజలు కేవలం ఓటర్లుగా మిగిలిపోకుండా రాజకీయంగా ఎదగడానికి తెలుగుదేశం పార్టీ తోడ్పాటునిచ్చిందని తెలిపారు. ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెపితే, చంద్రబాబు నాయుడు తెలుగువారి మేధస్సును ప్రపంచానికి



పరిచయం చేశారు. ఎన్టీఆర్ ఏ ఆశయాలతో అయితే తెలుగుదేశం పార్టీని స్థాపించారో ఆ ఆశయాలను చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళుతున్నారని, యువగళం పేరుతో పాదయాత్ర చేసి, ప్రజల కష్టసుఖాలు తెలుసుకొన్న నారా లోకేష్ , ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తూ, టిడిపి కార్యకర్తల సంక్షేమం కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి, కష్టాల్లో ఉన్న కార్యకర్తలను ఆదుకుంటున్నారన్నారు . ఈ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టిడిపి నాయకులకు కార్యకర్తలకు మరొకసారి శుభాకాంక్షలు తెలియచేస్తూ.. మాలేపాటి వంశం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ చెప్పిన కార్యక్రమాలను తూచా తప్పకుండా పాటిస్తూ.. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తామని, అదేవిధంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయ సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు

# కారంపూడిలో టీడీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహణ

**-ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి..!**
**- ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు**
**-టిడిపి ఆధ్వర్యంలోనే పేదవారికి న్యాయం..!**
**-మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి**



**విజ్ఞాన్ దినపత్రిక, మణికుమార్,కారంపూడి (మార్చి: 29 )** తెలుగుదేశం పార్టీ స్థాపించి 44 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్టీ ఆవిర్భావ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.బస్ స్టాండ్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు ఎద్దుల బండిపై ఎమ్మెల్యేను తీసుకువచ్చి, బైక్ ర్యాలీతో స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి వేడుకలను ఆనందంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పులిహోర పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ, ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడిన మహానేత అని పేర్కొన్నారు. "సమాజమే దేవాలయం, పేదవారే దేవుళ్లు" అనే సిద్ధాంతంతో ఆయన పాలన సాగిందన్నారు. పేదలకు కనీస సౌకర్యాలు, రెండు రూపాయల కిలో బియ్యం పథకం ద్వారా ఆకలి తీర్చడం, పక్కా గృహాలు అందించడం వంటి సంక్షేమ కార్యక్రమాలను దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రవేశపెట్టారని ఆయన గుర్తుచేశారు.రైతులకు విద్యుత్ సదుపాయం కల్పించడం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు ఇవ్వడం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం వంటి సంస్కరణలను ఎన్టీఆర్ అమలు చేశారని తెలిపారు. పేదల సంక్షేమానికి టీడీపీ పార్టీ కట్టుబడి ఉందని, పెన్షన్లు, మహిళా రిజర్వేషన్లు వంటి పథకాల ద్వారా ప్రజలకు న్యాయం జరిగిందన్నారు.ఇటీవల అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, శాశ్వత రాజధాని కోసం అసెంబ్లీ ఆమోదం కూడా లభించిందని తెలిపారు. పేద ప్రజలకు న్యాయం జరిగితే అది టీడీపీ ఆధ్వర్యంలోనే సాధ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లా వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు ముఖ్య సమావేశం హాజరైన బొత్స కురసాల గుడివాడ





అనకాపల్లి జిల్లా బయ్యవరం దగ్గర ఎస్ ఆర్ కన్వెన్షన్ హాలులో వైయస్సార్ పార్టీ ముఖ్యనాయకుల కార్యకర్తల పార్టీ సమావేశం జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీ బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలోఘనంగా జరిగింది ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్ఆర్ పార్టీ శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ బొత్స సత్యనారాయణ గారు మాట్లాడుతూ పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశా దశ నిర్దేశించారు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్బోధించారు మరో ముఖ్య అతిథి విశాఖ జిల్లా రీజినల్ ఇన్చార్జ్ కురసాల కన్నబాబు మాట్లాడుతూ కార్యకర్తలు నాయకులు పార్టీ కార్యక్రమాల ప్రజల్లో తీసుకెళ్లాలని కోరారు మరో ముఖ్య అతిథి మాజీ మంత్రివర్యులు చోడవరం నియోజకవర్గ ఇన్చార్జ్ రీజినల్ ఇన్చార్జ్ శ్రీ గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ కూటమి తాలూకా తప్పుడు నిర్ణయా ప్రజల్లో తీసుకెళ్లి ప్రజల తరపున పోరాటం చేసి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారిని మళ్లీ ముఖ్యమంత్రి చేసేవరకూ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు ఈ సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల మాజీ ఎంపీ శ్రీమతి బీశెట్టి వెంకట సత్యవతి ఏమ్మెల్సీ వరద కళ్యాణి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జె సుభద్ర పరిశీలకులు హైమావతి నియోజకవర్గ ఇన్చార్జీలు శ్రీ కరణం ధర్మశ్రీ మలసాల భరత్ కుమార్ పెట్ల ఉమా శంకర్ గణేష్ కంభంపాటి జోగులు అదీప్ రాజు మాజీ ఎమ్మెల్యే ఉప్పాలపాటి వెంకటరమణమూర్తి రాజు కన్నబాబు మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు జిల్లా కార్యవర్గ సభ్యులు అనుబంధ కమిటీ చైర్మన్ లు సభ్యులు వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఎంపీడీవో వైఫల్యం కారణంగానే దగదర్తి మండలంలో ఉపాధి హామీలో అవినీతి

-శనివారం జరిగిన సామాజిక తనిఖీలో గుసగుసలు

-ఎంపీడీవో లాగిన్ లో నుండి మూడో వ్యక్తికి బదిలీ అయిన ఉపాధి హామీ విత్ హెల్డ్నిధులు

- లాగిన్ లో నుండి అంటే పొరపాటు,ఫైల్ మీద సంతకం పెట్టింది ఎవరు?

- సమగ్ర విచారణ జరిపితే లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టవు అంటూ మండలవాసుల అభిప్రాయం



**కందుకూరు విజ్ఞాన్ దినపత్రిక దగదర్తి** ఎంపీడీవో వైఫల్యం కారణంగానే మండలంలోని ఉపాధి హామీలు అవినీతి రాజ్యమేలుతుందని దగదర్తి లో శనివారం జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ వేదికలో పాల్గొన్న మండల వాసులు గుసగుసలాడుకోవడం వినిపించింది. వర్క్ ఆర్డర్ లేకనే పనులు పెట్టడం ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్ తో సంబంధం లేకుండానే మస్టర్లు వేయడం నిధులు మంజూరు అయిన సమయంలో సదరు ఎంపీడీవో గారికి నిధులు చెల్లించినట్లయితే నియమ నిబంధనలు అడ్డెరావని మండలంలో ప్రచారం జోరుగా సాగుతోంది. ఉపాధి హామీ పథకానికి ప్రోగ్రాం ఆఫీసర్ గా వ్యవహరిస్తున్న ఎంపీడీవో ఏపీవో ఉపాధి హామీకి సంబంధించి పంపిస్తున్న ప్రతి ఫైలు క్షుణంగా పరిశీలించి ఆమోదం తెలిపి పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తూ ప్రభుత్వ నిధులను కాపాడాల్సిన అవసరం ఉండగా ప్రభుత్వ నియమ నిబంధనలను గాలికొదిలి తన వ్యక్తిగత స్వార్థం కోసం దగదర్తి మండలంలో సుమారు కోటి రూపాయల ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం పరోక్షంగా కారకుడు అయ్యాడని సాక్షాత్తు ఆ శాఖలోని సిబ్బంది సామాజిక తనిఖీ వేదికగా గుసగుసలాడుకుంటున్నాడు పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. మండలంలో గతంలో పనిచేసిన ఉపాధి హామీ నిధులకు సంబంధించి విత్ హెల్డ్ నిధులు సుమారు 17 లక్షల రూపాయలు ఎంపీడీవో లాగిన్ నుండి పనులు చేసిన వారి ఖాతాకి గాని లేదంటే పంచాయతీ ఖాతాకి గాని బదిలీ కావాల్సి ఉండగా సంబంధం లేని మూడో వ్యక్తుల ఖాతాలలో నిధులను మళ్లించి తన జేబులో వేసుకునేందుకు ఎన్ఆర్ఈజీఎస్ సిఓని పావుగా వాడుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై శనివారం జరిగిన సామాజిక తనిఖీలో పలువురు విచారణ అధికారులను మరియు ఎంపీడీవోను నిలదీసి అడుగుగా ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు తమ నిరసనను విరమించుకున్నారు.నిధులు పొరపాటున బదిలీ అయ్యాయని ఎంపీడీవో చెబుతున్న సదరు నిధులు బదిలీ అయ్యేందుకు ఫైలు పై ఎంపీడీవో సంతకం చేయాల్సి ఉండగా ఎంపీడీవోకి తెలియకనే సంతకం చేశారా నిధులను తమ అనుకూలరకు మళ్ళించారా అన్న ప్రశ్నలకు జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి మండల వాసులకు సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లోని రెండు గ్రామాలకు చెందిన వ్యక్తులకు ఎక్కువ మొత్తంలో విత్ హెల్డ్ నిధులను బదిలీ చేసి ఎప్పటికీ తమ వ్యక్తిగత అవసరాలకు వాడేసుకున్నట్లు మరి కొంతమంది తమ ఖాతాలో పడ్డాయి కాబట్టి మేము ఇవ్వమంటూ ఎదురు తిరగడంతో ఈ విషయం బయటకు పొక్కడంతో నిధులు పక్కదారి పట్టలేదంటూ భద్రంగానే ఉన్నాయంటూ పొరపాటు జరిగిందంటూ వివరణలు ఇచ్చుకుంటూ ఉండటం గమనార్హం. ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్న అందుకు సంబంధం ఉన్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వం నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేలా కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది

## కందుకూరు నాలుగో వార్డ్ లో టీడిపి ఆవిర్భావ దినోత్సవం



**కందుకూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** కందుకూరు పట్టణం 4వ వార్డు పరిధి, క లో వ రా ం ు రోడ్డులో...తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు , మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు. తదుపరి ఎదురుగా వున్న ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు కాంశ్య విగ్రహానికి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులు సమర్పించినారు

## బస్సు సర్వీసులు ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** కందుకూరు ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు కొత్తగా నడపబోతున్న 5 బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు.కందుకూరు నుండి గుంటూరుకు టుస్టార్ సర్వీసులు 3, కందుకూరు నుంచి గుడ్లూరు, భీమవరం ఉలవపాడు మీదుగా హైదరాబాద్ బి హెచ్ఇఎల్ వరకు ఒకటి, కందుకూరు నుండి విశాఖపట్నంకు మరొక సర్వీసును ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు ప్రాంత ప్రయాణికులకు అనుకూలంగా ఉండేలా కొత్త బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు చెప్పారు. అలాగే కందుకూరు డిపో పరిధిలో... కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు తీసుకువచ్చేలా సంబంధిత మంత్రితో మాట్లాడతానని తెలిపారు. పలు గ్రామాలకు నడుస్తున్న బస్సు సర్వీసులు, కొత్తగా నడపాల్సిన సర్వీసులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో డిఎం ఆర్ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు బెజవాడ ప్రసాద్, గోచిపాతల మోషే, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, ముచ్చు లక్ష్మీరాజ్యం, పార్వతి, చుండూరి శ్రీనివాసులు, మేడా మల్లికార్జున, గుమ్మా శివ, మచ్చా మనోహర్, అత్తింటి శివకృష్ణ, నల్లూరి సూర్యనారాయణ, భవనాసి వెంకటేశ్వర్లు, చుంచు వేణు శ్రావణ్, శివరామకృష్ణ, దారం విజయ్, యూనియన్ నాయకులు నల్లూరి సుబ్బారావు, శివకృష్ణ, డివై కొండలు మరియు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం గోకివాడ గ్రామంలో పేదలకు వస్త్ర దానములు పంపిణీ



**విజ్ఞాన పత్రిక రాంబిల్లి రిపోర్టర్ కోట్ని బాబురావు** అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం గోకివాడ గ్రామంలో ప్రతి శ్రీరామునకు గోకివాడ గ్రామ కాపురస్తులు,( పందల చిన్నతమ్మునాయుడు శ్రీమతి సన్యాసమ్మ) ( లేటు) కుమారుడు పందల కృష్ణ శ్రీమతి అమ్మాజీ, కుమార్తె పూర్ణ సాయి అల్లుడు శ్రీనివాసు, తార కుటుంబ సభ్యులు 15 సంవత్సరాల నుండి ,సుమారు 50 కుటుంబాలకు, నిరుపేదలకు, దుప్పట్లో, చీరలు, టవల్స్, నిత్య అవసరకులకు కొంత అమౌంట్ కుటుంబ సభ్యులు మొత్తం కలిసి ఇవ్వడం జరుగుతుంది

## పచ్చవ గ్రామంలో ఘనంగా నేతల విగ్రహాల ఆవిష్కరణ

-మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్న ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్ )** జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామంలో స్వర్గీయ ఎన్టీఆర్, మాజీమంత్రి, స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు, మాజీ సర్పంచ్, స్వర్గీయ తాటికొండ రాంబొట్లునాయుడు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి కలిసి విగ్రహాలను ఆవిష్కరించారు. ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, రాష్ట్ర మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు బంధువైన రాంబొట్లునాయుడు, చిన్నవయసులోనే చనిపోవడం బాధాకరమని, సర్పంచిగా, మండల పార్టీ అధ్యక్షుడిగా ప్రజలకు ఎంతో సేవ చేశారని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా, పార్టీ కోసం విధేయుడిగా పనిచేసి, ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. రాంబొట్లునాయుడు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ... తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని చెప్పారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేతలందరూ భారీ కేక్ కట్ చేశారు.

## 17వ వార్డులో ఘనంగా తెదేపా ఆవిర్భావ దినోత్సవం



**కందుకూరు ( విజ్ఞాన్ రిపోర్టర్)** కందుకూరు పట్టణంలోని 17వ వార్డు, తూర్పు కమ్మపాలెంలోని శ్రీశ్రీశ్రీ బంగారమ్మ గుడి సమీపంలో ఆదివారం ఉదయం తెదేపా 44.వ ఆవిర్భావ దినోత్సవంవార్డు అధ్యక్షుడు బెల్లం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగింది పార్టీ సీనియర్ నాయకుడు దివి కొండయ్య తెదేపా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దివి వెంకటేశ్వరరావు, దివి శ్రీనివాసరావు, చిమటా సుబ్బారావు, దివి కోటేశ్వరరావు, బత్తిన వంశీ ,ఉన్నమ్ వెంకట్రావు, రావిజాలయ్య, రావి బాలకోటయ్య, కోటి, నవీన్ ,దివి భాస్కరరావు తదితరులు పాల్గొని తెలుగుదేశం పార్టీ విశిష్టతను చాటిచెప్పారు

## భోజనం ప్యాకెట్ల పంపిణీ



**ప్రకాశం జిల్లా కందుకూరు డివిజన్ (విజ్ఞాన్ రిపోర్టర్ )** దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జెడిబియం టౌన్ బాప్టిస్ట్ చర్చి వద్ద ఉన్న యాచకులకు మరియు పుచ్చలపల్లి సుందరయ్య నగర్ లో పూరి గుడిసెలలో నివసిస్తున్న పేదలకు దాతల సహకారంతో ఆదివారం భోజనం ప్యాకెట్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సేవా సమితి కార్యదర్శి శీలం వెంకటేష్ మాట్లాడుతూ యాచకులను, పేదలను కరుణతో చూడాలని ప్రతి ఒక్కరూ సాధ్యమైనంతవరకు వారికి ఆహారం లేదా అవసరమైన సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చనమాల శ్రీనివాసరావు, ప్రేమ్ బాబు, వేణుబాబు, శివ, విశ్వ, నితీష్, చరణ్ తేజ పాల్గొన్నారు.

## ఊటుకూరు మిక్స్ కాలని వద్ద లారీ ను ఓవర్ టేక్ చేయబోయి స్కూటరిస్ట్ దుర్మరణం



**సైదాపురం,విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్,మార్చి 29** సైదాపురం మండలం ఓరుపల్లి నుండి జామాయిల్ లోడ్ తో వెళుతున్న లారీని ఊటుకూరు మిక్స్ కాలని వద్ద జమాయిల్ లోడ్ లారీని వెనుక దుమ్ము తో ఓవర్ టెక్ చేసే సమయం లో లారీ హుక్ కు చొక్కా తగులుకుని కొద్ది దూరం ఆ లారీ స్కూటరిస్ట్ పెట్లూరు చెంచు రత్నం (40) ను యిడ్చుకు వెళ్ళి లారీ వెనుక టైర్ కింద పడి చక్రాలు ఎక్కి దిగడం తో చెంచు రత్నం అక్కడిక్కడే మృతి చెందారని ఆ ప్రదేశం లో వున్న వారు తెలిపారు. బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి యాకసిరి రమణయ్య కుడి వైపు పడి గాయపడ్డారు. రోడ్ల గోతులు తో దుస్థితి కి చేరడం కారణం దుమ్ము ధూళి కి వాహన చోదకులు ప్రాణాలు కోల్పోతున్నారు. సైదాపురం – దేగపూడి రోడ్డు వేయటానికి కాంట్రాక్టర్ జాప్యం ఒక కారణం కాగా రోడ్డు పై ప్రమాదాలు పెరిగి వాహన చోదకులు ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి. ఇన్ ఛార్జ్ ఎస్ ఐ రామ కృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని మృతుడు కి శవ పంచనామా చేసి పోస్టు మార్టం నిమిత్తం 108 లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రోడ్డు ప్రమాదం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## లిక్రీడలు మానసిక ఒత్తిడి తగ్గిస్తాయి

-ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**విజ్ఞాన్ దినపత్రికరూరల్ రిపోర్టర్** పని ఒత్తిడిని కేవలం విశ్రాంతి ద్వారానే కాకుండా.. క్రీడల ద్వారా కూడా తగ్గించుకోవచ్చని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఆదివారం బుజ బుజ నెల్లూరులో గల ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంధ్ర క్రికెట్ గ్రౌండ్ లో విపిఆర్ ఫౌండేషన్ సహాయ సహకారాలతో సింహపురి చార్టెడ్ అకౌంటెంట్స్ నిర్వహించిన క్రికెట్ పోటీల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొని విజేతలకు ట్రోఫీలు అందచేశారు. ఈ సందర్భంగా క్రికెట్ లీగ్ నిర్వాహకులు ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ శ్రీనివాసరావు గారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి చార్టెడ్ అకౌంటెంట్స్ ఘన స్వాగతం పలికి పుష్ప గుచ్చాలతో సన్మానించారు. సింహపురి చార్టెడ్ అకౌంటెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రికెట్ లీగ్ లో నెల్లూరు, అనంతపురం, ఒంగోలు, విజయవాడ, వైజాగ్, రాజమండ్రి జిల్లాలకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్స్ తో పాటు ఇన్కమ్ టాక్స్ అధికారుల జట్టు పాల్గొంది. బిజీ లైఫ్ నుంచి ఆటవిడుపునకు క్రీడలు దోహదం చేస్తాయని, ఇటీవల ఎమ్మెల్యేలు సైతం విజయవాడలో క్రీడా ఉత్సవాలలో పాల్గొన్న విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ బి క్రికెట్ టర్ఫ్ ప్రారంభించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**విజ్ఞాన్ దినపత్రిక బుచ్చిరెడ్డిపాలెం రిపోర్టర్** నేటి సమాజంలో యువత పెడదోవ పట్టకుండా, శారీరక మరియు మానసిక దృఢత్వంతో ముందుకు సాగడానికి క్రీడలు ఒక అద్భుతమైన సాధనమన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి . బుచ్చిరెడ్డి పాళెం మండలం దామరమడుగు గ్రామంలో ఆమె ఆర్ బి క్రికెట్ టర్ఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేయడం వల్ల యువతలో క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. యువత చెడు సావాసాల వైపు లేదా మాదకద్రవ్యాల వంటి వ్యసనాలు వంటి అనారోగ్యకరమైన అలవాట్లకు దూరంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా ఆర్ బి క్రికెట్ టర్ఫ్ నిర్వాహకులు అరాఫత్ ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అభినందించారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buldings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.